వాడవాడలా ప్రగతి జాడ

ఫోకస్

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన చేపట్టారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. అభివృద్ధిలో భాగంగా నగర పరిధిలో ప్రతీ వార్డుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ వంటి సమస్యలను తీర్చడంతో పాటు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, శ్మశానవాటికల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ వంటి పనులు చేపట్టారు. 68వ వార్డులోనే అనేక పనులకు జీవీఎంసీ నుంచి కోట్లాది రూపాయలను వెచ్చించి పనులు చేస్తుండగా.. మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి.

పూర్తయిన పనులు

- జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లోని మింది చెరువు పక్కన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని రూ.2 కోట్లతో నిర్మించారు.
- మింది శ్మశానవాటికను రూ.1 కోటి 12 లక్షలతో, అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికను రూ.1 కోటి 15 లక్షలతో, గుడివాడ అప్పన్నకాలనీ శ్మశానవాటికను రూ.35 లక్షలతో అభివృద్ధి చేశారు.
- మిందిలోని వాటర్ పంప్ హౌస్ ఫిల్టరైజేషన్ ప్లాంట్ నిర్మాణానికి రూ.50 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు.
- రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో రూ.92 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మించారు.
- మిందిలో రూ.1 కోటితో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.
- అక్కిరెడ్డిపాలెంలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.1 కోటి వెచ్చించారు.
- నాడు–నేడులో భాగంగా అక్కిరెడ్డిపాలెం, మింది జెడ్పీ హైస్కూల్స్, అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్నకాలనీలలోని ఎంపీపీ స్కూల్స్‌లో మొత్తం రూ.2 కోట్ల 50 లక్షలతో వసతులు కల్పించారు.
- అక్కిరెడ్డిపాలెంలోని చెరువు అభివృద్ధికి రూ.1 కోటి 48 లక్షలతో పనుల పూర్తయ్యాయి.
- అక్కిరెడ్డిపాలెం, పంచవటీల్లో ఓపెన్ జిమ్‌లకు రూ.10 లక్షలు కేటాయించారు.

వార్డు : 68
కార్పొరేటర్ : గుడివాడ అనూష

చేపట్టిన మేజర్ వర్కులు

- రూ.2.50 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- రూ.1.48 కోట్లతో చెరువుల ఆధునీకీకరణ
- రూ.2 కోట్లతో రాంనగర్ యూపీహెచ్‌సీ నిర్మాణం
- రూ.2.62 కోట్లతో శ్మశానవాటికల అభివృద్ధి
- రూ.2.92 కోట్లతో రోడ్లు డ్రైనేజీల నిర్మాణం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ప్రతిపాదిత పనులు

- మిందిలో రూ.70 లక్షల వ్యయంతో పలు చోట్ల సివిల్ వర్క్స్ జరగాల్సి ఉంది. వీటితో పాటు అక్కిరెడ్డిపాలెం చెరువు వద్ద, రాంనగర్, గుడివాడ అప్పన్నకాలనీలలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుకు ప్రపోజల్స్ ఉన్నాయి.
- వార్డు పరిధిలో సామాజిక భవనాలు, పార్కులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఊహించలేనంత అభివృద్ధి

68వ వార్డులో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి, మంచి నీటి పైపులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్లు, కాలువలు ఇలా పనులు చేపట్టారు. శ్మశానవాటికల అభివృద్ధి, పాఠశాలల్లో వసతులు ఊహించలేనంతగా జరిగాయి. సమస్య తెలియజేయగానే కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ సత్వరం సమస్యలు పరిష్కరిస్తున్నారు.
– రేవతి, గృహిణి, అక్కిరెడ్డిపాలెం

ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం



నగరంలోనే ఆదర్శ వార్డుగా 68వ వార్డును తీర్చిదిద్దుతున్నాం. వార్డు అభివృద్ధిలో ఎక్కడా వెనకడుగు వెయడం లేదు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇంకా కొన్ని పనులు చేపట్టాల్సి ఉంది, ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేస్తాం.
– గుడివాడ అనూష, 68వ వార్డు కార్పొరేటర్


అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్న అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక


నిర్మాణం చేపట్టిన తర్వాత అక్కిరెడ్డిపాలెంలో ఒక వీధిలో రోడ్డు

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డుల పంపిణీ నేడు

పెదగంట్యాడ: సీనియర్ సిటిజన్లు వారి హక్కులు తెలుసుకునేందుకు కృషి చేస్తున్నామని హెల్ప్ ఏజ్, ఎల్డర్ హెల్ప్ లైన్ ఆర్గనైజర్ బెల్లాల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా. హెల్ప్ ఏజ్, ఎల్డర్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న సాయంత్రం 4.30 గంటలకు 76వ వార్డు నడుపూరులోని నూకాలమ్మ ఆలయంలో సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు. ఆధార్ కార్డు మాదిరిగానే ఈ గుర్తింపు కార్డు కూడా ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ సిటిజన్లందరూ ఈ సమావేశానికి హాజరై గుర్తింపు కార్డులు పొందాలని కోరారు.

17న ఎన్‌జేసీఎస్ బోనస్ సమావేశం

ఉక్కునగరం: ఎన్‌జేసీఎస్ బోనస్ సమావేశం ఈ నెల 17న న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశం ఉత్పత్తి, ఉత్పాదకతలకు పరిమితం అయింది. ఈ సందర్భంగా ఎన్‌జేసీఎస్ నాయకులు బోనస్‌పై తేల్చాలంటూ చేసిన డిమాండ్‌కు సెయిల్ యాజమాన్యం అంగీకరించి, ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎన్‌జేసీఎస్ నాయకుల సమాచారం.

స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఆటోనగర్ ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ పరిధి రాంనగర్‌లోని ఏ–బ్లాక్‌లో స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం రాంనగర్‌లోని ఏ–బ్లాక్‌లో గ్లోబెక్స్ పక్కన సీఎంఆర్ రోడ్డులో భూమి పూజ చేశారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.25.80 లక్షలతో 30 లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పరవాడ ఐలా కార్యదర్శి రాజశేఖర్, ఏ–బ్లాక్ మెంబర్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కార్డన్ సెర్చ్

- సరైన ధ్రువపత్రాలు లేని 31 బైక్‌లు సీజ్


తనిఖీ చేస్తున్న పోలీసులు

దొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

విజ్ఞాన్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శుక్రవారం పలు పారిశ్రామిక సంస్థలను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, మెడికల్ టెక్నాలజీ ఇన్ ఇండియా, హెల్త్‌కేర్ డివైజ్, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి సంస్థల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విజ్ఞాన్ ఈసీఈ హెడ్ సీహెచ్.రమేష్ బాబు మాట్లాడుతూ మెడ్ టెక్ జోన్‌లో టెక్నాలజీ పార్క్, ఇక్కడ అందుబాటులో ఉన్న ప్రయోగశాలలు విద్యార్థులు పరిశీలించారని చెప్పారు. కార్యక్రమంలో సైంటిస్ట్ ఎస్.నరేష్‌కుమార్, విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు కొత్త కర్ణవానిపాలెంను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ ప్రాంతవాసులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కొత్త కర్ణవానిపాలెంలో పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.14లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు కులుకూరి మంగరాజు, బెవర సత్యనారాయణ, గొరుసు సత్యం, లక్ష్మణరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

9న మెగా అప్రెంటిస్ మేళా

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఈ నెల 9న మెగా అప్రెంటిస్ మేళాను నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాకు హాజరు కానున్నారని వివరించారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, కోపా, మెకానిక్ డీజిల్, టర్నర్, మిషనిస్ట్, కార్పెంటర్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనర్ మెకానిక్ ట్రేడుల్లో 150 సీట్లకు పైగా ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు. విద్యార్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91773 91289 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బంగారు భవిష్యత్తుకు మళ్లీ జగనే సీఎం కావాలి

– ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్–2లో గల 66, 71, 72, 73 వార్డులకు సంబంధించి ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి॥ శిక్షణ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు అధ్యక్షతన స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పల దేవన్‌రెడ్డి, రోజారాణి, కార్పొరేటర్లు రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఐరన్ ఓర్ సరఫరాకు చర్యలు చేపట్టాలని వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ఐరన్ ఓర్ సరఫరాకు సత్వర చర్యలు తీసుకోవాలని స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్ర నాథ్ సిన్హాను కోరారు. శుక్రవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర కార్యదర్శి, సెయిల్ చైర్మన్‌లను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న ఐరన్ ఓర్ కొరత దృష్ట్యా నిరంతర సరఫరా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తాము, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశామన్నారు. రోజుకు 6 నుంచి 7 ర్యాకులు సరఫరా జరగాల్సి ఉండగా, రెండు నెలలుగా ఎన్‌ఎండీసీ సరిగ్గా సరఫరా చేయడం లేదన్నారు. దీంతో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు బదులు రెండు ఫర్నేస్‌లు మాత్రమే నడపాల్సి వస్తుందని తెలిపారు. గంగవరం పోర్టులో ఉన్న ఎన్‌ఎండీసీ, సెయిల్‌కు చెందిన ఐరన్ ఓర్‌ను స్టీల్‌ప్లాంట్‌కు మరల్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.


సెయిల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదినారాయణ

సీసీ కెమెరాలతో బహుళ ప్రయోజనాలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

ఉక్కునగరం: షాపులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేర నియంత్రణతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఉక్కునగరంలోని కళాశాలలు, పాఠశాలల ప్రతినిధులకు సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానమన్నారు. ఈ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులను పట్టుకోవడం సులభమవుతుందన్నారు. తద్వారా పోలీసు శాఖకు సహకరించిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

అక్కిరెడ్డిపాలెం: వ్యాపార సముదాయాల యజమానులు, నివాసితులు తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ లంకా భాస్కరరావు సూచించారు. గాజువాక హైస్కూల్ రోడ్డు జంక్షన్, శ్రీ గౌరీ సేవా సంఘం ఆలయం వద్ద వ్యాపార సముదాయాల సంఘం యజమానులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యజమానులు తమ దుకాణాల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. హైస్కూల్ రోడ్డులోని క్రైం ఏరియాలో నివాస యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొల్లి సతీష్ పాల్గొన్నారు.


వ్యాపార సముదాయాల యజమానులకు అవగాహన కల్పిస్తున్న గాజువాక సీఐ భాస్కరరావు

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14 బాలురు, బాలికల విభాగాల పోటీలు, ఎంపికలు పరవాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని ఇండోర్ స్టేడియంలో, అండర్ 17 బాలురు బాలికల పోటీలు, ఎంపికలు బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.

10న యోగా పోటీలు

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ స్థాయి యోగా పోటీలు, ఎంపికలు ఈ నెల 10వ తేదీన పరవాడ మండలం ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. బాలురు, బాలికలకు అండర్ 14,17 విభాగాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్న జట్ల ఎంపిక చేపడతామని తెలియజేశారు.

బౌద్ధాలయాల అభివృద్ధికి చేయూత అవసరం

కంచరపాలెం: రాష్ట్రంలోని బౌద్ధాలయాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని భారత బుద్దిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కోరారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ నేతృత్వంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన బౌద్ధ సొసైటీ సభ్యులను కేంద్ర సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విశాఖలోని బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. బౌద్ధ క్షేత్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు బౌద్ధ సమాజ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అశోక్‌నగర్ బౌద్ధాలయంలో సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వేణుగోపాల్ గౌతమ్, ఫ్రెడీ, సూరిబాబు, సిహెచ్.బాబూరావు, బౌద్ధ సమాజం సభ్యులు పాల్గొన్నారు.


బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, సభ్యులను సత్కరిస్తున్న బౌద్ధాలయ సభ్యులు

కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కుట్రలను పోరాటంతోనే ఎదుర్కొంటామన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 967వ రోజు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాటాడుతూ కార్మికులు కష్టాన్నే నమ్ముకుని తీవ్రంగా శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను పెంచారని అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు చొక్కాలు అందిస్తున్న సీఐ భాస్కరరావు, సత్యనారాయణ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా లా అండ్ ఆర్డర్ సీఐ ఎల్ భాస్కరావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి ఆటో డ్రైవర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. గాజువాక పోలీస్‌స్టేషన్ వద్ద గల సీతారామ కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గాజువాకలో ట్రాఫిక్ సమస్యకు ఆటోలు కూడా కారణంగా మారాయన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, అధిక లోడుతో ప్రయాణించవద్దని, ఆటో ముందు సీటులో ఎవరినీ కూర్చోపెట్టవద్దని తెలిపారు. మద్యం సేవించి ఆటో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న 132 మంది ఆటో డ్రైవర్లకు లక్కీ షాపింగ్ మాల్ అధినేత స్వామి ఖాకీ చొక్కాలను అందజేశారు.

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7–23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. చోరీ అయిన వాటిలో బంధువుల ఆభరణాలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ డ్రై డే పాటించాలి

పెదగంట్యాడ: సీజనల్ వ్యాధులు వ్యాప్తిని కట్టడి చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. అందులో భాగంగా ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. 74వ వార్డు సిద్దేశ్వరంలో శుక్రవారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలసి స్థానికులకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందన్నారు. ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ ఎస్ వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి, సిబ్బంది

రిమాండ్ ఖైదీ మృతిపై 12న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ రొంపల్లి రామకృష్ణ మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తవలసకు చెందిన రాంపల్లి రామకృష్ణ రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఆయన మృతి చెందాడు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. భీమిలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విచారణ చేపడుతున్నామని.. రామకృష్ణ మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు.

9 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి స్థూలకాయ నివారణకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 99854 56160, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలి.